

గజరాజులకు స్వాగతం పలుకుతున్న ఏపీ డీసీఎం పవన్ కళ్యాణ్





ప్రసంగిస్తున్న ఏపీ డీసీఎం పవన్ కళ్యాణ్

- గజరాజుల దాడిపై తక్షణమే స్పందించారు
- ఏపీకి కర్ణాటక సహకారం మరువలేనిది
- అపూర్వ ఆతిథ్యంతో కుంకీల అప్పగింత
- సిద్దూ సర్కార్‌పై పవన్ కళ్యాణ్ ప్రశంసలు
- ఏపీ డీసీఎంకు రాష్ట్ర సర్కార్ గజ సత్కారం

అడగ్గానే.. అంగీకరించారు..!

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): గజరాజుల దాడి గురించి వివరించగానే స్పందించారు..అపూర్వ ఆతిథ్యంతో కుంకీలను అప్పగించారు. కర్ణాటక ప్రభుత్వ సహకారాన్ని మరువలేను.. అంటూ ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్ ప్రశంసించారు. బుధవారం కుంకీ ఏనుగుల అప్పగింత కార్యక్రమం నగరంలోని విధానసౌధ వద్ద ఘనంగా జరిగింది. కృష్ణ (15), అభిమన్యు (14), దేవా (39), రంజన్ (26) అనే గజరాజులను ఏపీ డీసీఎం పవన్‌కల్యాణ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఏనుగుల నుంచి మనుషులు, పంట పొలాల సంరక్షణకు శిక్షణ పొందిన ఏనుగులను అప్పగిస్తున్నామన్నారు. ఏనుగులతోపాటు మావటీలు వెళ్లి అక్కడ వారికి శిక్షణ ఇస్తారన్నారు. కర్ణాటకలో 6,395 ఏనుగులు ఉన్నాయని దేశంలోనే అత్యధికమన్నారు. ఏనుగులు అడవులను వీడకుండా పలు జాగ్రత్తలు రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. సరిహద్దుల్లో రైల్వే ట్రాక్ కమ్మీలతో కంచె, కాలువల తవ్వకంతోపాటు పలు చర్యలు తీసుకున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున డీసీఎం పవన్‌కల్యాణ్ గత ఏడాది ఆగస్టులో కుంకీ ఏనుగులు అవసరమని కోరిన మేరకు అంగీకరించామన్నారు. ప్రస్తుతం 4 పంపుతున్నామని ఆ తర్వాత మరో 2 పంపుతామన్నారు. అవసరమైతే మరిన్ని ఏనుగులను పంపి ఆ రాష్ట్రంలో ఏనుగులనుంచి మనుష్యుల సంరక్షణకు కట్టుబడ్డామన్నారు. పొరుగు రాష్ట్రాలతో పరస్పర సహకారం అవసరమని భావిస్తున్నామన్నారు. ఏనుగులు అడవులను వీడకుండా ఉండాలంటే అటవీసంపద విస్తీర్ణం పెంచాలన్నారు. ఏనుగులు అప్పగించడం ద్వారా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం మరింత బాగుంటుందని భావిస్తున్నా అన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ కర్ణాటక వన్యసంపద గొప్పదన్నారు. బాల్యంలో కనకపుర ప్రాంతంలో ఇళ్ల చెంతకు ఏనుగులు వచ్చేవన్నారు. ఇటీవలే కబిని జలాశయాన్ని సందర్శించానని, పులులు, ఏనుగులు, జింకలు చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఏనుగులంటే గణపతి రూపమని, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని విఘ్నాలు తొలగాలని ఆశిస్తున్నామన్నారు. మరిన్ని ఏనుగులు పంపేంతటి శక్తి తమకు ఉందన్నారు.



ఏనుగుల అప్పగింత పత్రాలను అందజేస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం

- అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె

రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణ అటవీ విస్తీర్ణం పెంపు రిజర్వు ఫారెస్టుల మనుగడకు ప్రాధాన్యం ఇస్తున్నామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె అభిప్రాయపడ్డారు. ఏనుగుల అప్పగింత కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో ఏపీ, కర్ణాటకలలో అటవీ ప్రాంతాలకు సంబంధించిన వివిధ అంశాలపై డీసీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించామన్నారు. చిత్తూరు జిల్లా పరిధిలో ఏనుగుల దాడులు తీవ్రమయ్యాయని తెలిపిన మేరకు కుంకీ ఏనుగులు అప్పగించే విషయమై చర్చించామన్నారు. అందుకు అనుగుణంగానే రెండు రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల వ్యవధిలో 8.50 కోట్ల మొక్కలు నాటామని, వాటి మనుగడపై ఆడిట్ జరిపామన్నారు. 6,125 ఎకరాలు ఆక్రమణలు తొలగించామని, గ్రేటర్ బెంగళూరు పరిధిలో 5,678 ఎకరాలను సంరక్షించామన్నారు. హెచ్ఎంటీ సంస్థకు కేటాయించిన 443 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునే ప్రక్రియ సాగుతోందన్నారు. ఈ భూమి విలువ మార్కెట్‌లో 15వేలకోట్లకుపైగా ఉంటుందన్నారు. ఏనుగులు అడవులను వీడి బయటకు రాకుండా ఉండేందుకు పలు విధాలా పనులు అమలు చేస్తున్నామన్నారు. ఉపాధి పనుల ద్వారా కాలువల తవ్వకం, వందలాది కిలోమీటర్ల కంచె ఏర్పాటు, రైల్వేకమ్మీలతో కంచె ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు అందుబాటులో ఉండేలా అడవులలో కుంటలు తవ్వామన్నారు. దేశవ్యాప్తంగా ఆరేళ్లలో ఏనుగుల దాడితో 2,853 మంది చెందారన్నారు. ఒరిస్సాలో 624మంది, జార్ఖండ్‌లో 474 మంది మృతి చెందారన్నారు. దేశంలో అత్యధిక ఏనుగులు ఉన్న కర్ణాటకలో కేవలం 160మంది మాత్రమే మృతి చెందారని ఇది తక్కువే అయినా మరింత నియంత్రించే చర్యలు కొనసాగిస్తున్నామన్నారు. వివిధ అభయారణ్యాలలో శిక్షణ పొందిన 4 ఏనుగులను పంపుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఏనుగులు పంపడం ఇదేమీ కొత్త కాదని, గతంలోనూ ఏనుగులు పంపిన సంప్రదాయం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులనుంచి మానవులను సంరక్షించే విషయంలో కర్ణాటక సంపూర్ణంగా సహకరించనుందన్నారు.



గజరాజులతో మావటీలు

కర్ణాటక సహకారం మరువలేను: పవన్‌కల్యాణ్



పవన్ కల్యాణ్‌ను సత్కరిస్తున్న సీఎం

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి పాలన అయినా ఏనుగులనుంచి మనుష్యులను సంరక్షించే ప్రక్రియకు సహకరించాలని కోరిన వెంటనే సీఎం సిద్దరామయ్య మానవత్వంతో ఆలోచించి అంగీకరించారని ఏపీ డీసీఎం పవన్‌కల్యాణ్ కొనియాడారు. ఏనుగుల స్వాధీనం సభలో కన్నడిగులను ఆకట్టుకునేలా పవన్‌కల్యాణ్ మాట్లాడారు. కన్నడ నాడగీత జయభారత జననియ తనుజాతె అంటూ కన్నడ నేల, కన్నడతల్లి అంటూ స్మరించుకున్నారు. జాతీయకవి కువెంపు వ్యాఖ్యలను ప్రస్తావించారు. గత ఏడాది ఏనుగుల విషయమై సీఎం సిద్దరామయ్య, అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రెలతో చర్చలు సంతోషం అనిపించాయన్నారు. అందుకు అనుగుణంగానే ఏనుగులు అప్పగించారన్నారు. రాష్ట్రంలో 20ఏళ్లుగా ఏనుగుల సంఘర్షణతో ఎంతోమంది రైతులు, కూలీలు మృత్యువాత చెందారన్నారు. వాటిని నియంత్రించాలనే కుంకీ ఏనుగులను తీసుకెళ్తున్నామన్నారు. పర్యావరణ సంరక్షణకు సహకరించే విషయమై రెండు రాష్ట్రాల అటవీశాఖలు సమన్వయంగా ఒప్పందం చేసుకున్నాయన్నారు. సమావేశంలో మంత్రులు దినేశ్‌గుండూరావు, కేజే జార్జ్, బైరతి సురేశ్, రెహమాన్‌ఖాన్, సుధాకర్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ సహా అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రాజకాలువల అభివృద్ధి తప్పనిసరి

- నగరంలో వరద నిర్మూలనకు అదే పరిష్కారం
- ఆక్రమణలపై ఎంతటివారైనా వదలం
- సిటీ రౌండ్స్‌లో సీఎం



సిటీరౌండ్స్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలో తగ్గు ప్రదేశాల్లో వర్షపునీరుతో తరచూ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే రాజకాలువల అభివృద్ధితో వరదనీటి ముప్పు నిర్మూలన సాధ్యమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బుధవారం సిటీ రౌండ్స్‌ముగిశాక సీఎం మీడియాతో మాట్లాడారు. మాన్యతాటెక్ పార్క్ వద్ద రాజకాలువ ఆక్రమణ జరిగిందని, మూడు నెలల్లో కాలువ నిర్మించేలా ఆదేశించామన్నారు. హెచ్‌బీఆర్ లే అవుట్‌లో రాజకాలువ సమస్యతోనే ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. సాయి లే అవుట్‌లో రాజకాలువ కంటే తగ్గు ప్రదేశం కావడం, రైల్వే బ్రిడ్జ్ నిర్మాణలు జరగడంతో ఇక్కడ సమస్య ఉందన్నారు. రూ.13కోట్లతో శాశ్వతమైన పనులకు ఆదేశించామన్నారు. మహదేవపుర పరిధిలోని పణత్తూరు గార్డెన్‌లో నీరు ముందుకు వెళ్లకపోవడంతోనే ఇళ్లలోకి చేరిందన్నారు. సిల్క్‌బోర్డు జంక్షన్‌కు 4 ప్రాంతాల నుంచి నీరు వస్తుందని, ఈ ప్రభావమే హెచ్ఎస్ఆర్ లే అవుట్‌పై పడిందన్నారు. మెట్రో, బీబీఎంపీ, నేషనల్ హైవేల సమన్వయంతో సమస్యను పరిష్కరించేలా ఆదేశించామన్నారు. నగరంలో 2022లో 299 మిమీ వర్షం కురిసిందని తాజాగా 19న సోమవారం 132 మిమీ కురవడంతో సమస్య ఏర్పడిందన్నారు. రాజకాలువ 800 కిలోమీటర్లు ఉండగా 491 కిలోమీటర్లు లైనింగ్ పనులు జరిగాయని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. రాజకాలువలను ఆక్రమించినవారు ఎంతటి పలుకుబడి కల్గినవారైనా చర్యలు తీసుకుంటామన్నారు. సిటీ రౌండ్స్‌లో డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు బైరతి సురేశ్, జార్జ్ తదితరులు ఉన్నారు.



కొమ్మ పడి మృతిచెందిన మహిళ

కోరమంగల సౌభాగ్యస్టోర్ మార్గంలో చెట్టు కొమ్మ కూలిన ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువతి మృతి చెందగా వెనుక కూర్చున్న యువతికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్ర పోలీస్‌బాస్‌గా డాక్టర్ ఎంఏ సలీం

- డీజీపీ అలోక్‌మోహన్ నుంచి బాధ్యతల స్వీకరణ
- మూడు దశాబ్దాల తర్వాత మైనార్టీలకు అవకాశం



అలోక్‌మోహన్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తూ..

బెంగళూరు, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్‌బాస్‌గా సీఐడీ విభాగంలో డీజీపీగా వ్యవహరిస్తున్న డాక్టర్ ఎంఏ సలీం బాధ్యతలు చేపట్టారు. డీజీపీగా ఉన్న అలోక్‌మోహన్ పదవీకాలం బుధవారం ముగుస్తున్న తరుణంలో ప్రభుత్వం కొత్త డీజీపీని మధ్యాహ్నం ప్రకటించింది. సీనియారిటీ ప్రకారం అగ్నిమాపకశాఖ ప్రశాంత్‌కుమార్ ఠాకూర్, సీఐడీ డీజీపీ సలీం, సైబర్ విభాగం డీజీపీ ప్రణవ్‌మహంతితోపాటు ఏడుగురి పేర్లు ప్రస్తావనకు రాగా చివరకు సలీం, ప్రశాంత్‌కుమార్ ఠాకూర్‌లు పోటీ పడ్డారు. సీఎం సిద్దరామయ్య తీసుకున్న నిర్ణయంతో సలీం రాష్ట్ర 43వ డీజీపీగా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. 1993 బ్యాచ్‌కు చెందిన సలీం ఏడాదిపాటు డీజీపీ హోదాలో కొనసాగనున్నారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లాకు చెందిన సలీం మూడు దశాబ్దాలనుంచి సేవలు పోలీస్ శాఖలో అందిస్తున్నారు. కుశాల్‌నగర్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఉడుపి, హాసన్ ఎస్పీగాను, మైసూరు నగర పోలీస్ కమిషనర్‌గాను, దావణగెరె ఐజీపీగాను, బెంగళూరు నగర ట్రాఫిక్ చీఫ్‌గాను వ్యవహరించారు. ప్రస్తుతం సీఐడీ డీజీపీగా ఉన్నారు. ట్రాఫిక్ విభాగంలో ఆయన పీహెచ్‌డీ చేశారు. మైసూరు నగర పోలీస్ కమిషనర్‌గా వ్యవహరించినప్పుడు ట్రాఫిక్ సంస్కరణలు ప్రాచుర్యం పొందాయి. బెంగళూరులోనూ ఇదే తరహాలో గడిచిన రెండేళ్లక్రితం వ్యవహరించారు. రాష్ట్రంలో 1980 కాలంలో నిజాముద్దీన్ తర్వాత, కేరళకు చెందిన ఏఆర్ ఇన్ఫంట్ కొనసాగారు. ఆ తర్వాత మైనార్టీ వర్గానికి చెందిన సలీంకు డీజీపీగా చేరేందుకు చాలా కాలమే పట్టింది. 2026 జూన్‌తో ఆయన పదవీకాలం ముగియనుంది. కాగా ఏప్రిల్ నెలాఖరుకే డీజీపీ అలోక్‌మోహన్ పదవీకాలం ముగియాల్సి ఉన్నా 21 రోజులు పొడిగించారు.

అలోక్ మోహన్‌కు ఘనంగా వీడ్కోలు

డీజీపీ అలోక్‌మోహన్ పదవీకాలం ముగియడంతో ఘనంగా వీడ్కోలు పలికారు. కోరమంగలలోని కేఎస్ఆర్‌పీ మైదానంలో 200మంది పోలీసు అధికారులు గౌరవవందనం సమర్పించారు. సాదరంగా ఆయన వీడ్కోలు పలికారు. సాయంత్రం డీజీపీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో కొత్తడీజీపీ బాధ్యతలు చేపట్టారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అలోక్ మోహన్





జడమడుగుకు జలకళ

బాగేపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పాతపాళ్య హోబళి గుజేపల్లి వద్ద ఉన్న జడమడుగు జలపాతానికి జలకళ సంతరించింది. కరువుపీడిత బాగేపల్లి తాలూకాలో ఎప్పుడూ జలక్షామం ఎదుర్కొంటోంది. చుక్కనీటికోసం తహతహలాడిన సందర్భాలు ఉన్నాయి. అలాంటిది వేసవిలో సైతం జలకళను చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జలపాతాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.



సిద్ద మ్మనహళ్లిలో పొంగిపొర్లుతున్న హిడేవాగు

ఏ వంక చూసినా నీరే..!

- బళ్లారి జిల్లాను కుదిపేసిన వర్షం
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- జనజీవనం అస్తవ్యస్తం

పిడుగుపాటుకు మహిళ మృతి



యల్లమ్మ(ఫైల్)

రాయచూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురైన మహిళ మృత్యువాతపడిన సంఘటన జిల్లాలోని దేవదుర్గ తాలూకా లింగదహళ్లిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. లింగదహళ్లి గ్రామానికి చెందిన యల్లమ్మ(55) వర్షం కురుస్తున్న వేళ బహిర్భూమి కోసం బయటికి వెళ్లింది. ఆకస్మాత్తుగా పిడుగు పడడంతో అక్కడికక్కడే ఆమె మృత్యువాత పడింది. మృతురాలికి భర్త ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మహిళ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు జోరందుకున్నాయి. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. పిడుగులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం అరకెరా తాలూకా భోగి రామనగుండా గ్రామ సమీపంలో హనుమగౌడ నాయక్ అనే బాలుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పెళ్లాం కొడుతోంది..!

- బంధువులతో కలిసి చంపేయాలని చూస్తోంది
- పోలీస్ కమిషనర్ ముందు బాధితుడి కంటతడి



బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటికి వెళ్తే పెళ్ళాం కొడుతోందని, తర బంధువులతో కలిసి హతమార్చాడానికి ప్రయత్నిస్తోందని ఓ వ్యక్తి హుబ్బళ్ళి నగర పోలీస్ కమిషనర్ శశికుమార్ ఎదుట కంటతడి పెట్టుకున్న వీడియో వైరల్ అయ్యింది. హుబ్బళ్ళి నగరంలో కారు షోరూంలో పనిచేసే మహ్మద్ సాదిక్, హానగల్‌కు చెందిన ఆసియా భార్యాభర్తలు. నాలుగేళ్లక్రితం వీరికి వివాహమైంది. ఇద్దరూ అన్యోన్యంగా ఉండేవారు. ఇటీవలే భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తాయి. దాదాపు రెండేళ్లుగా భార్య పుట్టింట్లో ఉంటోంది. ఇదే విషయమై సాదిక్ నగర పోలీస్ కమిషనర్‌ను మంగళవారం కలసి కంటతడిపెట్టారు. గొడవలు వీడి తన ఇంటికి రావాలని కోరితే హుబ్బళ్ళి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. భార్య తరపు బంధువులు రౌడీలను పంపి హతమారుస్తామని బెదరిస్తున్నారన్నారు. ఇంటికి వెళ్లి పిలుద్దామంటే భార్య కొడుతోందని వాపోయాడు. ప్రాణాలకు ప్రమాదం ఉందని కంటతడి పెట్టాడు. ఈమేరకు భార్యను పిలిపించి విచారించారు. భార్య మాత్రం బంగారు నగలు తీసుకుని ఇవ్వడం లేదని, పెళ్లి సమయంలో 50 గ్రాముల బంగారం, రూ.20వేల నగదు కట్నం ఇచ్చామన్నారు. తన చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు దాచేశారని, పుట్టింటినుంచి డబ్బులు తీసుకురావాలని వేధిస్తున్నట్టు ఫిర్యాదు చేసింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.07	1,577.53
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	6,261	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,139	0
నీటి నిల్వ (టీఎంసీలు)	8.75	3.39

విజయలక్ష్మి దేవస్థానంలో
ఆభరణాల చోరీ

- వెండి ప్రభావళి, దేవిపాదాల చోరీ
- దొంగలను పట్టుకుంటాం: పోలీసులు

బళ్లారి, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే రెండో సరోవరంగా పేరొందిన పంపాసరోవరం వద్ద ఉండే విజయలక్ష్మి దేవి ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారికి అలంకరించిన వెండి ప్రభావళ్లి, వెండి పాదకములు గుర్తి తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గంగావతి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పళ జిల్లా గంగావతి తాలూకా ఆనేగొంది పంచాయితీ పరిధిలోని విజయలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం-సంధ్యాపూజలు చేసి పూజారి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం పూజ చేయడానికి పూజారి ఆలయం వద్దకు రాగా విజయలక్ష్మి అమ్మవారి గర్భగుడి తలుపులు తెరుచుకున్నాయి. పూజారి లోపలికి వెళ్లి పరిశీలించగా అమ్మవారికి అలంకరించిన ఒకటిన్నర కిలో తూకం కలిగిన పురాతన వెండి ప్రభావళి, వెండి పాదకములు చోరీకి గురయినట్లు గమనించారు. విషయం పూజారి దేవదాయ శాఖ ఈఓకు తెలియజేశారు. ఈవో గంగావతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వచ్చి విచారణ చేశారు. సీసీ కెమెరాలున్నా అవి పనిచేయకపోవడంతో ఆనవాళ్లు గుర్తించడం కష్టమైంది. దొంగలను కచ్చితంగా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయంలో చోరీపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇక్కడ గుప్త నిధులు కోసం తవ్వకాలు జరిగాయి. ఇప్పటికైనా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న గాలింపు

- మూడు రోజులైనా దొరకని బాలుడి ఆచూకీ



గాలిస్తున్న పోలీసులు

కంప్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): నదిలో మూడు రోజుల క్రితం గల్లంతైన గౌతమ్ కోసం మూడు రోజులుగా గాలింపు కొనసాగుతోంది. పలగు, రాత్రి లెక్క చేయకుండా గంగావతి ఫైర్ స్టేషన్ సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. బాలుడి ఆచూకీ కానరాకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ సందర్భంగా చిక్కజంతగల్లు గ్రామస్తులు మాట్లాడుతూ నదిలో పగలు రాత్రి వేళల్లో ట్రాక్టర్ బండ్లతో అక్రమంగా ఇసుక తరలించడంతో గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు.



మరియమ్మనహళ్ళి వాగు వద్ద నిలిచిపోయిన రాకపోకలు



రైల్వే అండర్ పాస్ వద్ద ఇరుక్కుపోయిన బస్సు

ఏ వంక చూసినా నీరే..!

బళ్లారి సిటీ, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం వర్షం దంచికొట్టింది. సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షంతో జనజీవనం అస్తవ్యవస్థంగా మారింది. సండూరు తాలూకాలోని యశ్వంత్‌నగర్ గ్రామంలో భారీ వర్షాల కారణంగా రహదారులు జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

- సండూర్, తోరణగల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో జోరువాన కురిసింది. యశ్వంత్‌నగర్ గ్రామంలో భారీ వర్షాల కారణంగా రైల్వే ఓవర్ పాస్ దిగువ భాగంలో పెద్ద మొత్తంలో వర్షపు నీరు పేరుకుపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వంతెన కింద పెద్దమొత్తంలో వాగులోకి నీరు చేరుకుంది. వర్షపు నీటిలో ఇరుకున్న బస్సు ఆగిపోవడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. యశ్వంత్ నగర్ గ్రామం నుంచి సండూర్ వరకు వాహనాలు బారులు తీరాయి. సాధన సమావేశానికి వెళ్లే వాహనాలు కూడా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకోవడంతో సుదూర గ్రామాలకు వెళ్ళే ప్రజలు కొన్ని గంటలపాటు నిలిచిపోయారు. వంతెన కింద నీటిలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి.
- కురుగోడు తాలూకాలోని చాలా గ్రామాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమయ్యింది. తాలూకాలోని సిద్దమ్మనహళ్ళి చుట్టూ భారీ వర్షాల కారణంగా హిడెవాగు నంది పొంగిపొర్లింది. కురుగోడు నుంచి కుడితిని వెళ్ళే రోడ్డుపై గుంతలు నిండి రోడ్డుపైకి నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నీటి ప్రవాహనం తగ్గిన తర్వాత ప్రయాణాలు సాగాయి.
- విజయనగరం జిల్లా మరియమ్మనహళ్లిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పట్టణ పరిధిలోని సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. పటణం నుంచి యశ్వంత్‌నగర్ సండూర్‌లను కలిపే రహదారి మూసివేయడంతోఇరువైపులా వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు.

కార్మికులను రక్షించిన స్థానికులు

విజయనగరం జిల్లాలో భారీ వర్షం కారణంగా తాలూకాలోని బైలవద్దిగేరిలో బుధవారం వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నవిద్యుత్ కార్మికులను స్థానికులు రక్షించారు. బైలువద్దిగేరి గ్రామ సమీపంలోని రైల్వే స్టేషన్ సమీపంలో విద్యుత్ పని చేయడానికి వచ్చిన కార్మికులు మహేంద్ర గూడ్స్ వాహనంలో వెళుతుండగా నీటిలో కొట్టుకుపోతున్న కార్మికులను స్థానికులు తాడు సహాయంతో రక్షించారు. ఈప్రాంతంలో అనేక పొలాలు నీట మునిగాయి. వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో మరో వారం పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటిచింది.



కార్మికులను రక్షిస్తున్న స్థానికులు

కంప్లిలో జోరువాన

కంప్లి: కంప్లి తాలూకాలో జోరువాన కొనసాగుతోంది. వంక లు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. యశ్వంత్ నగర్ వద్ద రైల్వే ట్రాక్ కింది భాగంలో, హగరి బొమ్మనళ్లి వద్ద వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.



కంప్లిలో కురుస్తున్న వర్షం

వైభవంగా హులిగమ్మదేవి రథోత్సవం

కంప్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లాలో ప్రసిద్దిగాంచిన హులిగమ్మదేవి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ రథోత్సవంలో రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తాదులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే భాజాభజంత్రీల మధ్య ఊరేగింపు జరిపారు. భారీ వర్షం కురుస్తున్నా భక్తాదులు వర్షాన్ని లెక్కచేయకుండా అమ్మవారి భక్తిలో మునిగిపోయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. సాయంత్రం ఆలయం నుంచి ఎదురుకట్ట వరకు లక్షలాది భక్తాదుల మధ్య రథోత్సవాన్ని ఊరేగించారు. మునిరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వైద్యం కోసం రోగిని బండిపై తీసుకెళ్తున్న బీరబ్బి గ్రామ ప్రజలు

బండెక్కితేనే వైద్యం..!

- జ్వరమొస్తే బైక్‌లే దిక్కు
- చికిత్సకు 12 కి.మీ. వెళ్లాల్సిందే
- పీహెచ్‌సీకి నోచుకోని మూలెకట్టి, బీరబ్బి గ్రామాలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆ ఊరిలో జ్వరం వచ్చినా వైద్యం దొరకదు, అత్యవసర పరిస్థితుల్లోనైనా కి.మీ మేర ప్రయాణిచాల్సిందే. విజ్ఞానపరంగా దేశం, రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందినా... ఇంకా ఎన్నో మారుమూల గ్రామాలు ప్రాథమిక వైద్యానికీ నోచుకోవడం లేదు. విజయనగర జిల్లా, హూవినహడగాలి తాలూకా మూలెకట్టి, బీరబ్బి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వ వైద్యం అందాలంటే కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తోంది. ఈ గ్రామాలకు సరైన సమయంలో బస్సు సౌకర్యం లేక పోవడంతో గ్రామాల్లో ఎవరు అనారోగ్యానికి గురైనా... ద్విచక్రవాహనాలపైనే ఆరోగ్య కేంద్రానికి వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ కేంద్ర స్థానం బీరబ్బి గ్రామంలో 2వేలకు పైగా జన సంఖ్య ఉంది. పంచాయతీ పరిధిలో 8 గ్రామాలు సరైన రోడ్డు మార్గాలు లేకపోవడంతో తాలూకా కేంద్రానికి దూరంగా విసిరేసినట్లు ఉన్నాయి. దీంతో ఆ గ్రామాలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్ష పండుగా మారిందని చెప్పవచ్చు. బీరబ్బి వద్ద మైలార చక్కెర ఫ్యాక్టరీ ఉన్న కారణంగా చెరుకు క్రషింగ్ సమయంలో మూడువేలకు పైగా కార్మికులు ఫ్యాక్టరీలో పనిచేస్తుంటారు. ఈ అన్ని గ్రామాలు ప్రజల ఆరోగ్య సేవలు కావాలంటే సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిందే. మాగళకు బస్సు సౌకర్యం లేక పోవడంతో ఆనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళాలంటే... నరకయాతన పడాల్సి వస్తుంది. పోని తాలూకా ఆరోగ్య కేంద్రానికి వెళుదామంటే... అది ఈ గ్రామాలకు 25 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో మధ్యలో ఎక్కడ ఊపిరి ఆగి పోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బీరబ్బి చక్కర ఫ్యాక్టరీ నుంచి వెలువడే వాయుకాలష్యం కారణంగా ఈ ప్రాంతంలో ప్రజలు నిత్యం అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇక్కడ గాలి, నీరు కలుషితం కావడంతో ప్రజలు నిత్యం దగ్గు, జ్వరాలతో ఆస్పత్రికి వెళ్తుంటారు. ఇక గర్భిణులు, విషపురుగుల కాటుకు గురైన వారి పరిస్థితి చెప్పనలవి కాదు... బీరబ్బి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యేని, జిల్లాధికారి దశాబ్దాల కాలంగా వేడుకుంటున్నా ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆరోగ్య అధికారులు మాట ఇందుకు భిన్నంగా ఉంది. ఆరోగ్య శాఖ మార్గసూచనల ప్రకారం ప్రస్తుతం కొత్తగా పీహెచ్‌సీ మంజూరు చేయడం సాధ్యం కాదని, ఉన్న ఆరోగ్య కేంద్రంలోనే వైద్య సేవలు అందించాలని సూచిస్తున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా..... పేదలకు ప్రభుత్వం అందించాలని ఎన్ని పథకాలు రూపొందించినా... నేటికీ ప్రభుత్వం వైద్యం అందని ఎన్నో మారుమూల గ్రామాలకు

ఇందిరా క్యాంటీన్ ప్రారంభం



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మే 21 (ఆంధ్రజ్యోతి): టెక్కలకోట పట్టణంలో ఇందిరా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బీఎం నాగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బుధవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో ఇందిరా క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఐదు రూపాయలకు టిఫెన్, పది రూపాయలకు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఇందిరా క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకుఉ ఇందిర క్యాంటీన్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ అధ్యక్షులు ఆనందప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున, బాలప్ప, నరేంద్ర సింహ, కౌన్సిలర్లు రమేష్, గణేష్, పరమేష, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రాయచూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గనుల కంపెనీ సమీపంలోని కోటా గ్రామంలో జూదం ఆడుతున్న నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కోటా గ్రామ ప్రధాన రహదారి సమీపంలో గత కొంతకాలంగా పెద్దఎత్తున జూదం సాగుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు బుధవారం ఉదయం దాడి చేయడంతో ఏడుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానానికి అప్పగించారు.

హోసూరు జోన్



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్

శ్రామిక మహిళల కోసం హాస్టల్

హోసూరు, మే 21(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని విశ్వనాథపురం గ్రామంలో శ్రామిక మహిళలకోసం నిర్మించిన హాస్టల్‌ను తమిళనాడు సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా ప్రారంభించారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కార్పొరేషన్ సహకారంతో హాస్టల్‌ను నిర్మించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రామిక మహిళలకోసం సౌకర్యంగా ఉండేందుకు ప్రభుత్వం నూతనంగా హాస్టల్ సదుపాయం కల్పించిందన్నారు. ఇక్కడ 166 పడకలతో 59 గదులు ఉన్నాయన్నారు. బయోమెట్రిక్ ఎంట్రీ, 24 గంటల భద్రత, ఉచిత ఇంటర్నెట్ సదుపాయం, టీవీ, వాషింగ్ మిషన్, ఇస్త్రీ, పార్కింగ్ తదితర సౌలభ్యాలు ఉన్నాయన్నారు. బస్టాండ్‌కు 3 కిమీ, రైల్వేస్టేషన్‌కు 5 కిమీ దూరంలోనూ, ప్రభుత్వ ఆసుపత్రికి 4 కిలోమీటర్ల దూరంలో హాస్టల్ ఉందని, వేర్వేరు ప్రాంతాలలో పనిచేస్తున్న మహిళలకు ఈ హాస్టల్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ ప్రియాంక, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, సాంఘిక సంక్షేమ అధికారి శక్తి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి వినతి

రాయచూరు, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26వ విద్య సంవత్సరంలో 100 ఉర్దూ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేసేందుకు అంగీకరించిన నేపథ్యంలో తమ జిల్లాకు తగిన అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ ఎ వసంత్ కుమార్ కోరారు. బుధవారం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ వసంత్ కుమార్, జిల్లాలో పెద్దఎత్తున ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని ముఖ్యంగా నగరంలోనే 10కిపైగా పాఠశాలలు ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. వీటిలో కనీసం మూడు పాఠశాలలను అప్‌గ్రేడేషన్ పరిధిలోకి తీసుకోరావాలని కోరారు. దీంతోపాటు జిల్లాలో మస్కి, సిరవార, కవితాళ, సింధనూరు తాలూకాలకు ఒక్కోకటి మురార్జిదేసాయి వసతి పాఠశాలలను మంజూరు చేయాలని కోరారు. యరమరస్ క్యాంప్, ఆశాపూర్ రోడ్డులోని ఆశ్రయ కాలనీ వద్ద ఒక మౌలానా ఆజాద్ మోడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించాలని కోరారు.

కెలవరపల్లి డ్యామ్ నుంచి నీటి విడుదల



డ్యామ్ నుంచి నీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కెలవరపల్లి డ్యామ్ నుంచి 1,410 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించి భద్రతాచర్యలపై ఆరా తీశారు. తాలూకాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ప్రస్తుతం 1,449 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా తెన్‌పెన్నై నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. నదీ కాలువ ప్రదేశంలో మూడోరోజు కూడా వరద హెచ్చరిక జారీ చేశారు. నది కాలువలో నురగ, దుర్వాసన వస్తోందని రైతులు వాపోతున్నారు. డ్యామ్ పరిశీలన సందర్భంగా సబ్‌కలెక్టర్ ప్రియాంక, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, అసిస్టెంట్ ఇంజనీర్లు శివ, సంగం, రాధిక ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కంట్రోల్ రూం

హోసూరు, మే 21(ఆంధ్రజ్యోతి): హోసూరు పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థకు సంబంధించి కంట్రోల్‌రూంను ఏఎస్పీ అనిల్ వాఘ్రే లాంచనంగా ప్రారంభించారు. ప్రధానంగా నాలుగు లేన్‌ల రహదారి, హోసూరు-హొగనేకల్ రోడ్డు, బెంగళూరు రోడ్డు, కెమలంగలం రోడ్డు, మాదిగిరి బస్టాండ్‌లలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలను పర్యవేక్షించడానికి వీలుగా కంట్రోల్ రూం పనిచేయనుందన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతోపాటు ప్రమాదాలకు కారణమయ్యే వాహనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చునన్నారు. అత్యవసర సహాయంకోసం పోలీసుశాఖను సంప్రదించడానికి వీలుగా వాట్సాప్ నంబరు, అత్యవసర ఫోన్ నెంబరు 9600235674ను ప్రారంభించారు. నేరాల నియంత్రణకు సహకరించే సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ముత్తుస్వామి, కార్తికేయన్ ఉన్నారు.



అత్యవసర ఫోన్ నంబరును ప్రారంభిస్తున్న ఏఎస్పీ అనిల్ వాఘ్రే

నేడు హనుమజ్జయంతి

పెనుకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాలు, సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. స్థానిక ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం 7 గంటల నుంచి అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ 9గంటల నుంచి వాల్మీకి రామాయణం, అంతర్గత సుందరాకాండ యజ్ఞం, మహామంగళహారతి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పవన్‌కుమార్ తెలిపారు. దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అలంకరణలో స్వామివారు

ముగిసిన రెండు రోజుల గణిత వర్క్‌షాప్

బళ్లారి సిటీ,మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీరశైవ కళాశాలలో నిర్వహించిన గణితంపై రెండురోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్లనగౌడ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు కొత్త సాంకేతికతలు, వినూత్న బోధనా నైపుణ్యాలపై విస్తారమైన సమాచారాన్ని అందించారన్నారు. ఇది ఉపాధ్యాయులు కొత్త నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి, విద్యార్థులకు నాణ్యమైన అభ్యాసం, నైపుణ్యాలను అందించడానికి అవకాశం అందించిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు లెక్చరర్లలో ఆలోచనలు పెంచుతాయన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లుగావచ్చిన గణిత శాస్త్ర ప్రముఖులు డాక్టర్ బూసునూర్ మఠం రుషి కుమార్, లోకేశ్, గిరీశ్, డాక్టర్ రమేశ్ ప్రసాద్‌పాండా, డాక్టర్ పద్మణాభరెడ్డి, డా.అశ్విన్ కుమార్,వివిధ కొత్త బోధనా నైపుణ్యాలపై ప్రసంగించారు. ఈసందర్భంగా డా. ప్రభయ్య, విద్యావర్ధక సంఘానికి చెందిన వివిధ కళాశాల గణిత శాస్త్ర ప్రొఫేసర్లు, డా.శ్రుతి, వినోద్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లనగౌడ

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శ. శంకరనారాయణ కౌంట్...

అన్నమయ్య (జయంతి)



అన్నమయ్య లేదా తాళ్లపాక అన్నమాచార్యులు 1408 మే 22న కడప జిల్లా తాళ్లపాక గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్య చరిత్ర ఆధారాల మేర కు తొలి వాగ్గేయకారుడు. ఆయనకు పదకవితా పితామహుడు అనే బిరుదు ఉంది. దక్షిణాపథంలో భజన సంప్రదాయానికి, పదకవితా శైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి, అహోబిలం నరసింహస్వామి ఇతర దేవతామూర్తులను కీర్తిస్తూ 32వేలకుపైగా కీర్తనలు రచించారు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసుకుని ఉంటాయి. అన్న మయ్యను శ్రీనివాసుడి అవతారంగా కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు కొనియాడారు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనాచార్యులకు అన్నమయ్య మార్గదర్శకుడు. 1503 ఏప్రిల్ 4న పరమపదించారు.

రాజా రామ్‌మోహన్‌రాయ్ (జయంతి)



దేశంలో పేరొందిన గొప్ప సంఘ సంస్కర్త రాజా రామ్‌మోహన్ రాయ్ 1772 మే 22న బెంగాల్‌లోని రాధానగర్ జన్మించారు. దేశంలో తొలి సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారు. ఆయన ప్రభావం రాజకీయ, ప్రభుత్వ నిర్వహణ, విద్యారంగాలలోనే కాక హిందూమతంపైన కూడా చూపింది. అప్పటి సతీసహగమన సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి ఎనలేని కృషి చేశారు. వితంతు పునర్వివాహానికి మద్దతు ఇచ్చి, స్త్రీ విద్యకు పాటుపడ్డారు. బ్రహ్మ సమాజ్‌ను స్థాపించి బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ముఖ్యులుగా గుర్తింపు పొందారు. 1833 సెప్టెంబరు 27న కన్నుమూశారు.

బెళగెరె కృష్ణశాస్త్రి (జయంతి)



గాంధేయవాదిగా గుర్తింపు పొందిన బెళగెరె కృష్ణశాస్త్రి 1916 మే 22న చిత్రదుర్గ జిల్లా బెళగెరెలో జన్మించారు. సరళ, సాదాసీదా వ్యక్తిత్వానికి ఆయన మారుపేరు. కన్నడ రచయిత, తత్వవేత్తగా రాణించారు. భూదాన్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఉత్తర కర్ణాటకలో గ్రామస్థుల సహకారంతో ఎన్నో పాఠశాలలు నిర్మించారు. బెళగెరె గ్రామంలో శ్రీ శారదా మందిర ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర, కేంద్ర నుంచి అత్యుత్తమ అధ్యాపక పురస్కారం, 'హళ్ళి చిత్ర' నాటకానికి కేంద్ర నాటక అకాడమీ పురస్కారం, అళసింగాచార్, ఆకాశవాణి పురస్కారం, రాజ్యోత్సవ పురస్కారం పొందారు. 2013 మార్చి 22న కన్నుమూశారు.

ప్రసన్న (పుట్టినరోజు)



ఈఏఎస్ ప్రసన్నగా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత ఎర్రపల్లి అనంత రావు శ్రీనివాస్ 1940 మే 22న బెంగళూరులో జన్మించారు. కర్ణాటకలో రంజీ ట్రోఫీలో ఎంతగానో రాణించారు. 1961లో మద్రాస్, ఇంగ్లండ్‌ల మధ్య టెస్ట్‌క్రికెట్ మ్యాచ్‌లో స్పిన్ బౌలర్‌గా సత్తా చాటుకున్నారు. 20 టెస్టులలో 100 వికెట్లు సాధించారు. మైసూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌నుంచి పట్టా పొందారు. 1970లో పద్మశ్రీ, 50 టెస్ట్‌మ్యాచ్‌లకంటే ఎక్కువగా పాల్గొన్నందుకు 2012లో బీసీసీఐ నుంచి కాస్ట్రల్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం అందుకున్నారు.

నోవక్ జకోవిచ్ (పుట్టినరోజు)



నోవక్ జకోవిచ్ 1987 మే 22న జన్మించారు. సెర్బియా దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారుడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)చే 'వరల్డ్ నెంబరు 1' గా గుర్తింపు పొందారు. 426 వారాలపాటు రికార్డు కొనసాగింది. 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ మెన్స్ సింగిల్స్, 82 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ కైవశం చేసుకున్నారు. వీటిలో రాఫెల్ నడాల్‌తో కలసి 36 మాస్టర్ ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. ఏటీపీలో ప్లేయర్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. సమాజసేవ కార్యక్రమాలతో ప్రశంసలు పొందారు. యునిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ప్లీజ్

›› సీఎంకు మాజీ మంత్రి వినతి

మహదేవపుర, మే 21(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, టెండర్ పిలిచి వర్క్ ఆర్డర్‌లను అమలు చేయాలని సీఎం సిద్దరామయ్యను మాజీ మంత్రి అరవింద లింబావళి కోరారు. వర్షపునీటి సమస్యలపై బుధవారం సీఎం సిటీ రౌండ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పణత్తూరు ఎస్ క్రాస్, రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులు సీఎం పరిశీలించారు. నిర్మాణాలలో అడ్డంకులు, జాప్యం కావడంపై సీఎం, డీసీఎంలకు వివరించారు. మహదేవపుర నియోజకవర్గంలో 22 చోట్ల వర్షపీడిత ప్రాంతాలను గుర్తించామని సీఎంకు తెలిపారు. పణత్తూరు 150 ఫీట్ రోడ్డులో కేపీటీసీఎల్, అటవీశాఖకు సంబంధించిన సమస్య ఉండేదని, ఇటీవలే అనుమతులు లభించి నిర్మాణాలు పూర్తి కానున్నాయన్నారు. ఈ సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు కేజే జార్జ్, భైరతి సురేశ్ ఉన్నారు. స్థానిక బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎల్ రాజేశ్, లోకేశ్, మనోహర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి లింబావళి

గ్రామీణ యువత క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలి

శిడ్లఘట్ట, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత హైటెక్ యుగంలో గ్రామీణ యువతకు క్రీడల పట్ల ఆసక్తి ఉందని, గ్రామాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఆర్‌సీజీ ఫౌండేషన్ సంస్థాపకుడు, బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్ర గౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సాదలి గ్రామంలో మూడు రోజులపాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. స్థానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి క్రీడాపోటీలు మరింతగా నిర్వహించాలన్నారు. యువకులు దురలవాట్లకు లోను కాకుండా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదే రీతిన క్రీడాభావాలు పెంచుకోవాలని సూచించారు. క్రికెట్ టోర్నీలో మొత్తం 33 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులను సాదలి జట్టు కైవశం చేసుకోగా, తృతీయ బహుమతిని చిక్కదిబ్బూరహళ్ళి జట్టు దక్కించుకుంది. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ, దిశా మాజీ సభ్యుడు వెంకటేశ్, నవీన్‌కుమార్ (నాని), తిప్పణ్ణ, నాగరాజు, ఎస్‌జే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న సీకల్ రామచంద్రగౌడ

ఎస్‌ఎల్‌బీసీలో వార్షిక క్రెడిట్‌ప్లాన్‌కు శ్రీకారం

బెంగళూరు, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీ 169వ సభలో 2025-26 సంవత్సరానికి సంబంధించి వార్షిక క్రెడిట్‌ప్లాన్‌ను ప్రారంభించారు. ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్, కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ భాస్కర్ చక్రవర్తి పర్యవేక్షణలో సభ జరిగింది. ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి, డెవలప్‌మెంట్ కమిషనర్ ఉమా మహదేవన్ అధ్యక్షత వహించారు. కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌కే మజుందార్, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ విశాల్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్త, నబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సురేంద్ర బాబు పాల్గొన్నారు. క్రెడిట్‌ప్లాన్‌లో 11,88,986 కోట్ల రూపాయలుగా నిర్ణయించారు. ఇందులో ప్రాధాన్యతారంగాలకు రూ.4,38,016 కోట్లు కేటాయించగా ఇందులో వ్యవసాయ రుణాలకు 2,22,204 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు 1,40,108 కోట్లు, ఎంఎస్‌ఎంఈ 1,90,891 కోట్లు, విద్యారుణాలు 2,222 కోట్లు, వసతి 11,678 కోట్లు, ఇతర రంగాలకు 11,022 కోట్లుగా నిర్ణయించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



క్రెడిట్‌ప్లాన్ ఆవిష్కరణలో ఉన్నతాధికారులు

లాల్‌బాగ్‌లో మామిడి మేళా

బెంగళూరు, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని లాల్‌బాగ్ ఉద్యానవనంలో మామిడిమేళాను రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన మామిడి పండ్లను కొనుగోలు చేసి తినాలని పిలుపునిచ్చారు. రసాయనాలు వాడని సహజసిద్ధంగా పక్వానికి తెచ్చిన పండ్లు ఆరోగ్యానికి మంచివన్నారు. మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, హాప్‌కామ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మామిడిమేళా ప్రారంభంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

లారీ ఢీ - బస్సు అద్దాలు ధ్వంసం

దొమ్మసంద్ర, మే 21(ఆంధ్రజ్యోతి): సర్జాపుర - బెంగళూరు రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌జామ్ ఉంటుంది. బుధవారం ఉదయం సుమారు 9.30 గంటలకు యమరె గ్రామం ట్రినిటి అపార్ట్‌మెంట్ సమీపాన సిమెంట్ మిక్సర్ లారీ క్రాస్ చేసేవేళ బీఎంటీసీ బస్సును ఢీ కొంది. బస్సు కుడివైపు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బస్సులోని ఏడుగురు ప్రయాణీకులకు స్వల్ప గాయా లయ్యాయని వారికి స్థానిక స్పందన ఆసుపత్రిలో చికిత్సలు అందిం చినట్టు బస్సు డ్రైవర్ గోపాల్, కండక్టర్ బసవరాజు తెలిపారు. దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్ నుంచి అత్తిబెలెకు వెళ్లే మార్గంలో బీఎంటీసీ బస్సు డ్రైవర్ గోపాల్ మాట్లాడుతూ తాను ఎంతగా డిస్టన్స్ మెయింటైన్ చేసినా లారీ డ్రైవర్ యూటర్న్ చేయడంలో వెనుకనుంచి ఢీ కొన్నాడన్నారు.



దెబ్బతిన్న బస్సు అద్దాలు

తాయలూరులో గంగమ్మదేవి ఉత్సవం



అమ్మవారి విశేషపూజల్లో భక్తులు

ముళబాగిలు, మే 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తాయలూరు గ్రామంలో ప్రసన్నగ్రామదేవత గంగశిరస్సు ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మూలవిరాట్టుకు విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేషపూజలు, అలంకరణ చేశారు. తాయలూరు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమంగళీలు తలపై దీపాలతో మోసి అమ్మవారికి సమర్పించారు. సేవాకర్తలు విశేష ప్రసాద వినియోగం చేశారు. అధ్యక్షుడు ఆర్ నాగభూషణ్, గౌరవాధ్యక్షుడు జీఆర్ కుప్పస్వామి, ఉపాధ్యక్షుడు టీఆర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



జిల్లాఅధికారి రవీంద్ర తదితరులు

చిక్కబళ్ళాపుర, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లాస్థాయిఅధికారులు జిల్లాకేంద్రాన్ని వీడరాదని జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర సూచించారు. నైరుతి రుతుపవనాలకంటే ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో జిల్లా, తాలూకాస్థాయి అధికారులు అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధితశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంజనీపుత్రా.. అభయప్రదాతా..

నేడు హనుమజ్జయంతి - వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



విద్యుద్దీపాలంకరణలో హౌసింగ్ బోర్డు భక్తాంజనేయస్వామి దేవాలయం

అనంతపురం కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): అంజనీపుత్రుడు, శ్రీరామచంద్రుడి పరమ భక్తుడైన హనుమంతుడి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించనుకోనున్నారు. వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. హనుమజ్జయంతి రోజున ఆలయాలకు వెళ్లి పావనసుతుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు, పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజున పలువురు అన్నదానాలు చేస్తే.. మరికొందరు ఉపవాసాలుండి హనుమంతుడిని ఆరాధిస్తుంటారు. హనుమజ్జయంతి వేడుకలకు జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో వెలసిన భక్తాంజనేయస్వామి, నగరశివారు సోములదొడ్డిలోని అభయాంజనేయస్వామి, మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, రెవెన్యూ కాలనీ రామాలయం, మారుతీనగర్‌లోని పంచముఖాంజనేయస్వామి, పాతూరు వ్యాసరాజమఠం ఆవరణలోని మూలాంజనేయస్వామి, కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి, పాతూరు మార్కెట్‌వద్ద గల మండి ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, షేమియానాలు ఏర్పాటు చేసారు.

హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండోరోజు బుధవారం భక్తాంజనేయస్వామి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం వరకూ ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు.



అలంకరణలో భక్తాంజనేయ స్వామి

మసీదు కాంపౌండ్‌లో నిర్మాణాల కూల్చివేత

●ఏళ్ల తరబడి కొనసాగిన న్యాయ వివాదం ●కోర్టు ఆదేశాలతో రంగంలోకి అధికారులు ●అంతలోనే వక్ఫ్ ట్రిబ్యునల్ నుంచి నిలుపుదల స్టే ఆర్డర్

రాయచూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న హాష్మియా మసీదు కాంపౌండ్ స్థలంలో న్యాయవివాదంలో ఉన్న నిర్మాణాలను అధికారులు బుధవారం కూల్చివేశారు. ఈ స్థలం వివాదం 1989 నుంచి మొదలు కాగా ఇప్పటి వరకు జిల్లా న్యాయాలయం హైకోర్టు తదితర న్యాయస్థానాల జోక్యంతో నిలిచిపోగా ఎట్టకేలకు ఆ స్థలం హాష్మియా మసీదుకు చెందినదని నిర్మాణాలను తొలగించాలని కోర్టు ఆదేశించడంతో వక్ఫ్ బోర్డు అధికారులు రంగంలోకి దిగారు. బుధవారం ఉదయం నుంచే 15 ఎక్స్కవేటర్(జేసీబీ) యంత్రాల సహాయంతో పెద్ద ఎత్తున కూల్చివేతలు ప్రారంభించగా ఈ ప్రాంతంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో దాదాపు 20కి పైగా ఇళ్ల నివాస సలాలు ఉండగా అంతే సంఖ్యలో దుకాణాలు కూడా ఏళ్ల తరబడిగా నిర్మించుకున్నవి కొనసాగుతుండడం విశేషం. ఈ సందర్భంగా అక్కడ నివశిస్తున్న వారికి వ్యాపారులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోగా అధికారులు వాటినేమి ఖాతరు చేయకుండా తమ పనిని కొనసాగించారు. తమకు నోటీసులివ్వకుండానే కూల్చివేస్తున్నారంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా ఇప్పటికే నోటీసులిచ్చామని స్పందించకపోవడం వల్లే కార్యాచరణ చేపట్టామంటు అధికారులు చేబుతున్నారు. ఇదిలా ఉండగా కూల్చివేతలకు సంబంధించి ఇప్పటికే కలబుర్గి వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన బాధితులకు ట్రిబ్యునల్ నుంచి కొంత ఊరట లభించింది. ఈ నెల 27వ తేదీ వరకు వారు అద్దె చల్లించేలా ఆదేశించిన ట్రిబ్యునల్ అద్దె చల్లించడంలో విఫలమైతే నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తర్వులో పేర్కొంది. దీని పై నగరసభ వక్ఫ్ బోర్డు అధికారులు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

కూల్చివేతలపై స్పందించిన జిల్లా వక్ఫ్ సలహా మండలి అధ్యక్షుడు మౌలాన శరీఫ్ ఖాన్ కోర్టు ఆదేశాల మేరకు హాష్మియా మసీదు కాంపౌండ్ పరిధిలో ఉన్న అనధికారిక నిర్మాణాలను తొలగించామన్నారు. భవిసత్తులో ఇక్కడి ఉన్న పాఠశాలలు, కళాశాలలు, ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లు 25 బెడ్‌లుగల ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు.



ఎక్స్కవేటర్‌తో దుకాణాలను కూల్చివేస్తున్న అధికారులు

●అధికారుల వద్ద బాధితుల మొర

నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న హాష్మియా మసీదు కాంపౌండ్ స్థళంలో నిర్మించిన ఇళ్లు, దుకాణాల తొలగింపు సందర్భంగా బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. వక్ఫ్‌బోర్డు అధికారులు, పోలీసుల సహాయంతో నిర్మాణాల తొలగింపు చేపట్టగా బాధితులు అందుకు అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు అక్కడ నివశిస్తున్న ఇళ్ల వారినందరిని సమీపంలోని మహాత్మగాంధి స్టేడియం వద్ద వదలి పెట్టాల్సి ఉచ్చింది. ఈ దిశలో అక్కడికి వచ్చిన వక్ఫ్ బోర్డు అధికారులు తాము కోర్టు ఆదేశాలను గౌరవించాల్సి ఉంటుందని ఇప్పటికే పలు సార్లు హెచ్చరించినా అక్రమ నిర్మాణాల నుంచి యజమానులు ఖాళీ చేయలేదన్నారు. 13వ తేదీలోగానే నిర్మాణాలు కూల్చివేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నా తాము వారం రోజుల క్రితమే అందరికి నోటీసులు జారీ చేశామని అయినా ఇప్పటికి ఇళ్లు ఖాళీ చేయలేదన్నారు. ఈ దశలో అక్కడికి చేరుకున్న సహాయ కమిషనర్‌ను చుట్టుముట్టిన బాధితులు తమకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. దీని పై స్పందించిన కమిషనర్ ఇప్పటికే 15 రోజులకు పైగా అవకాశం ఇచ్చామని అవకాశం ఇవ్వడం కోర్టు ఆదేశాల మేరకు కుదరదని స్పష్టం చేశారు. మొత్తానికి దుకాణాలు కూల్చివేత ఉద్రిక్తతల మధ్య కొనసాగింది.



ఆందోళన చేస్తున్న వ్యాపారులు, గృహ యజమానులు